సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 27 । సెప్టెంబర్ । 2023



వన్డే టోర్నీలో బౌలర్లదే హవా

కడపలో జరిగే ఏసీఏ అంతర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో మంగళవారం నార్త్‌జోన్, సౌత్‌జోన్, నెల్లూరు జట్లు గెలిచాయి. -8లో..



ఫోర్జరీ కేసులో నిందితుల అరెస్టు

చుక్కల భూములకు ఎన్‌ఓసీ పేరుతో సంతకాలను ఫోర్జరీ చేసిన కేసులో నిందితులను మంగళవారం అరెస్టు చేశారు. -8లో..

గరిష్టం/కనిష్టం 33.5/24.5

వాతావరణం

జిల్లాలో మంగళవారం 24.5 - 33.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

వదలని వరుణుడు



కమలాపురం సమీపంలోని పాపాఘ్ని నదిలో ప్రవహిస్తున్న వరదనీరు

- జిల్లావ్యాప్తంగా వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు
- అత్యధికంగా జమల్మమడుగులో 62.4 ఎంఎం వర్షం
- కమలాపురం పాపాఘ్ని నది అప్రోచ్ రోడ్డుపై పొంగిపొర్లిన వరదనీరు

కడప అగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లావ్యాప్తంగా వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో జిల్లాలోని పలు వంకలు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. దీంతోపాటు కడప నగరంతోపాటు జిల్లాలోని పలు లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు వచ్చి చేరడంతో జనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజులుగా ప్రతి రోజు రాత్రిపూట వర్షాలు కురవడం తెల్లారంగానే ఎండలు కాయడం విశేషం. కాగా సోమవారం అర్ధరాత్రి నుంచి జిల్లాలో వర్షం ప్రారంభమై మంగళవారం తెల్లవారుజాము వరకు వర్షం ఏకధాటిగా కురిసింది. జిల్లాలోని జమ్మలమడుగులో 62.4 మిల్లీమీటర్లు అత్యధికంగా వర్షం కురిసింది. అలాగే కొండాపురంలో 57.2 ఎంఎం, సిద్దవటం, లింగాలలో 50.2 ఎంఎం వర్షం కురిసింది.

మండలం కురిసిన వర్షం(మి.మీ)

జమ్మలమడుగు	62.4	ఎర్రగుంట్ల	19.4
కొండాపురం	57.2	పులివెందుల	19.2
లింగాల	50.2	వేంపల్లి	13.4
సిద్దవటం	50.2	మైదుకూరు	13.2
మైలవరం	20.6	సింహాద్రిపురం	10.8
కలసపాడు	20.4	చాపాడు	10.2
ఖాజీపేట	19.6	సికెదిన్నె	9.4

ఉద్యాన పంటలకు దెబ్బే..

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. ఇప్పటికే జిల్లాలో ఖాజీపేట, లింగాల, పెండ్లిమర్రి మండలాల పరిధిలో 400 ఎకరాలకు పైగా చామంతి, కనకాంబరం, అరటి, దానిమ్మ, టమోట, ఉల్లి, మిరపతోపాటు పలు పంటల్లో వర్షపునీరు నిలిచి పంటలు దెబ్బతిన్నాయి. ఈ నష్టం మరింత పెరిగే అవకాశం ఉంది.

పాపాఘ్ని నది అప్రోచ్ రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు...

రెండు రోజులుగా జిల్లాలోని వేంపల్లి, వేముల, పెండ్లిమర్రి ప్రాంతాల్లో కురిసిన భారీవర్షాల కారణంగా కమలాపురం సమీపంలో పాపాగ్ని నది ఉధృతంగా ప్రవహించింది. దీంతో కమలాపురం సమీపంలో పాపాఘ్ని నదిపై ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డుపై వరదనీరు ప్రహించింది. దీంతో ఎటువంటి ప్రమాదం జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలో భాగంగా మధ్యాహ్నం వరకు భారీ వాహనాల రాకపోకలను నిలిపివేశారు. భారీ వాహనాలను కమలాపురం మీదుగా రాకుండా ఖాజీపేట మీదుగా కడపకు మళ్లించారు. దీంతోపాటు కడప నుంచి కమలాపురం వైపుకు వచ్చే వాహనాలు రాకుండా కడప ఇర్కార్ సర్కిల్ వద్ద వాహనాలను నిలిపివేశారు. వరదనీరు తగ్గడంతో మధ్యాహ్నం తరువాత వాహన రాకపోకలను పునరుద్ధరించారు.



నదిపై ఏర్పాటు చేసిన అప్రోచ్‌రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు

రౌడీ షీటర్లపై ఉక్కుపాదం

- ఫాస్ట్ ట్రాక్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి
- నేర సమీక్షలో జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప అర్బన్: జిల్లాలో వివిధ క్రిమినల్ కేసుల్లో నిందితులుగా వున్న రౌడీషీటర్లకు సాక్ష్యాధారాలతో శిక్ష పడేలా చర్యలు వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద గల 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ న్యాయస్థానాల్లో తగిన సాక్ష్యాధారాలతో రౌడీషీటర్లకు శిక్షపడేలా చర్యలు తీసుకుంటే తద్వారా వారి అక్రమ కార్యకలాపాలకు, దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేసేందుకు వీలవుతుందని ఎస్పీ తెలిపారు. ఫాస్ట్ ట్రాక్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి నిందితులకు శిక్ష పడేలా చూడాలని ఎస్పీ ఆదేశించారు. చోరీలు జరుగకుండా గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, జిల్లాలోని డిఎస్పీలుచ సీఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

విధి నిర్వహణలో అప్రమత్తత అవసరం

సాక్షి నెట్‌వర్క్: విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ నేరాలు జరగకుండా చూడాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ సూచించారు. వైఎస్ఆర్ జిల్లా సిద్దవటం, అట్లూరు, బద్వేల్ అర్బన్, చెన్నూరు, మైదుకూరు, ఖాజీపేట పోలీస్ స్టేషన్లను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని స్టేషన్లలో పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సమస్యలుంటే ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆయన సూచించారు. బద్వేల్ అర్బన్ స్టేషన్‌లో కమాండ్ కంట్రోల్ విభాగాన్ని చూసి సిబ్బందికి సూచనలు చేశారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలను ఉపేక్షించవద్దని చెన్నూరు స్టేషన్ సిబ్బందికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్, సీఐలు పురుషోత్తంరాజు, సుదర్శన్ ప్రసాద్, యుగంధర్, ఎస్ఐలు లక్ష్మీనారాయణ, రాజు, వెంకటరమణ, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశాలకు గడువు పెంపు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ జ్యోతి తెలిపారు. కడప మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ కోర్సులో ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు సెప్టెంబర్ 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అక్టోబర్ 3వ తేదీలోగా స్పాట్ అడ్మిషన్స్ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఫీజు రీయంబర్స్‌మెంట్‌కు అనర్హులన్నారు. కేటగిరీ వారీగా దాదాపు రూ. 6 వేల వరకు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

- ఆసక్తిగల వారు అక్టోబర్ 3న కళాశాలలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలని ఆమె సూచించారు. పాలీసెట్ 2023 ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రథమ ప్రాధ్యాన్యం కల్పిస్తామన్నారు. అలాగే 10వ తరగతి పాస్ అయిన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్స్ ప్రకియలో పాల్గొనవచ్చన్నారు.

న్యూస్‌రీల్

రామయ్య సన్నిధిలో ప్రిన్సిపల్ జడ్జి



రంగమండపంలో ప్రిన్సిపల్ జడ్జి శ్రీదేవిని సత్కరిస్తున్న ఆలయ అర్చకులు

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ఏకశిలపై వెలసిన సీతారామలక్ష్మణులను మంగళవారం కడప జిల్లా ప్రిన్సిపల్ జడ్జి శ్రీదేవి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ లాంఛనాలతో వారికి ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో మూల విరాట్‌కు జడ్జి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగమండపంలో స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైడీసీసీబీకి జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న వైడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఝాన్సీరాణి, సీఈఓ రాజేంద్రకుమార్

కడప అగ్రికల్చర్: జాతీయస్థాయిలో అన్ని బ్యాంకుల పనితీరు ఆధారంగా అప్పులు, అభివృద్ధి, వసూళ్లు, మూలధనం వంటి ప్రమాణాల ఆధారంగా నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కార్పొరేషన్ బ్యాంక్ లిమిటెడ్ 2021-22 సంవత్సరానికి వైఎస్సార్ డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ (వైడీసీసీబీ)ను అత్యుత్తమ బ్యాంక్‌గా ఎంపిక చేసింది. మంగళవారం జైపూర్‌లోని మ్యారియట్ హోటల్‌లో రాజస్థాన్ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి లాల్ చంద్ కటారియా, అగ్రికల్చర్ అండ్ రిజిస్టర్స్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రేయ గుహల చేతుల మీదుగా ఆప్‌కాబ్, వైడీసీసీ బ్యాంక్ చైరపర్సన్ మల్లెల ఝాన్సీరాణి, డీసీసీ బ్యాంక్ సీఈఓ కందుల రాజేంద్రకుమార్‌లను ఘనంగా సత్కరించి అవార్డును ప్రదానం చేశారు.

అంగళ్లు కేసు తీర్పు రిజర్వ్

కురబలకోట: అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలోని అంగళ్లు కూడలిలో చెలరేగిన అల్లర్ల కేసుపై మంగళవారం హైకోర్టులో విచారణ కొనసాగింది. ఈ కేసులో టీడీపీ అధినేత మాజీ సీఎం చంద్రబాబునాయుడు ఏ1గా ఉన్న విషయం తెలిసిందే. ఈ కేసులో బెయిల్ కోసం ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మంగళవారం వాదోపవాదాల అనంతరం హైకోర్టులో చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది.

స్కాలర్‌షిప్ వివరాల నమోదుకు నవంబర్ 30 వరకు గడువు

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి 2023లో జరిగిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో తమ వివరాలు నవంబర్ 30వతేదీలోపు నమోదు చేసుకోవాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోర్టల్ అక్టోబర్ 1 నుంచి ఓపెన్ అవుతుందన్నారు. విద్యార్థులు తమ వివరాలను అక్షరం తేడా లేకుండా మెరిట్ కార్డుపై ముద్రించిన విధంగా ఆధార్ మరియు బ్యాంకు పాస్‌బుక్‌లో ఉండే విధంగా వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. అదే విధంగా నవంబర్ 2019, ఫిబ్రవరి 2021 మరియు మార్చి 2022 సంవత్సరంలో ఎంపికైన ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ సంవత్సరం తప్పకుండా రెన్యూవల్ చేసుకోవాలని తెలిపారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

కడప కార్పొరేషన్: బేడ, బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయడం మంచి దేనని టీటీడీ బోర్డు సభ్యుడు ఆర్.వెంకట సుబ్బారెడ్డి(మాసీమ బాబు) అన్నారు. మంగళవారం బేడ, బుడగ జంగం హక్కుల పోరాట సమితి నాయకులు పస్తం అంజి ఆధ్వర్యంలో స్థానిక హెడ్ పోస్టాఫీసు ఎదుట వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాసీమ బాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీల్లో చేర్చుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడం సంతోషకరమన్నారు. పస్తం అంజి మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా బేడ, బుడగ జంగాల వారికి రెవెన్యూ అధికారులు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో చదువులకు దూరమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకురాలు తులశమ్మ, బేడ, బుడగ జంగం నాయకులు కె. లక్ష్మయ్య, ఆంజనేయులు, రాముడు, జమ్మయ్య, సాయన్న, శంకర్, పెద్దన్న, అర్జునయ్య, వెంకటయ్య, సలప్ప, బాలస్వామి పాల్గొన్నారు.



వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాసీమ బాబు, తదితరులు

మచిలీపట్నం స్పెషల్ రైలు తాత్కాలిక రద్దు

కలికిరి: మూడవ రైల్వే లైన్ పనుల వల్ల ధర్మవరం నుంచి మచిలీపట్నం స్పెషల్ ఫేర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును ఉన్నతాధికారులు 15 రోజుల పాటు రద్దు చేశారని కలికిరి రైల్వేస్టేషన్ మేనేజర్ మనోజ్ కుమార్ తెలిపారు. సోమ, మంగళ, గురు, శనివారాల్లో ధర్మవరం నుంచి మచిలీపట్నం స్పెషల్ (07096), ఆది, సోమ, బుధ, శుక్రవారం మచిలీపట్నం నుంచి ధర్మవరం వచ్చే స్పెషల్ (07095) వచ్చే నెల 10వ తేదీ వరకు రద్దు చేశారని, ప్రయాణికులు గమనించాలని ఆయన కోరారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో కొత్తగా పరిశ్రమల స్థాపించే ఔత్సాహికులకు ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం మంగళవారం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామిక రంగాన్ని పటిష్టపరచి విస్తృత పరచాలని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు. పారిశ్రామిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ఎ పెట్టుబడులు, యూనిట్ల స్థాపనపై యువతకు అవగాహన పెంపొందించాలన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ 2020-23 మేరకు వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం ద్వారా ఎస్సీ ఎస్టీ కేటగిరీలకు సంబంధించి నాలుగు యూనిట్లకు, జనరల్ కేటగిరీ కింద ఒక యూనిట్‌కు కలిపి రూ.33.72 లక్షల రాయితీ విడుదలకు కమిటీ ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జేసీ గణేష్‌కుమార్, పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ విజయలక్ష్మి, లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ దుర్గాప్రసాద్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

గండికోటకు అంతర్జాతీయ హంగులు

- పర్యాటక రంగం అభివృద్ధి వైపు వైఎస్ఆర్ జిల్లా
- ఎకో టూరిజంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

కడప కల్చరల్: పర్యాటక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో జిల్లాలో అభివృద్ధి వేగం పుంజుకుంది. అంతర్జాతీయ పర్యాటక ప్రపంచంలో వైఎస్సార్ జిల్లాకు ప్రత్యేక స్థానం దక్కేలా అడుగులు పడుతున్నాయి.

- విశాఖలో జరిగిన గ్లోబల్ టూరిజం సమ్మిట్ వేదికగా రాష్ట్రంలో పర్యాటక ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రపంచ ప్రఖ్యాత సంస్థలతో ఎంఓయూ కుదుర్చుకుంది. ఇందులో భాగంగా వైఎస్ఆర్ జిల్లాలో గ్రాండ్ ఆఫ్ ఇండియాగా పేరున్న గండికోటలో ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇప్పటికే గండికోటకు వచ్చే సందర్శకుల సంఖ్య బాగా పెరిగింది. స్థానిక హరిత హోటల్‌లో బస చేయాలంటే రెండు నెలల ముందే రిజర్వు చేసుకోవాల్సి వస్తోంది. వారాంతపు సెలవుల్లో బెంగళూరు, ముంబయి తదితర రాష్ట్రాల నుంచి టెక్కీలు పెద్ద సంఖ్యలో వస్తుండడంతో హరిత హోటల్ గదులు చాలక ప్రైవేటు టెంట్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ కారణంగా ప్రైవేటు టెంట్ల వ్యాపారం ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది. ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయడంతో ఆ ప్రాంతానికి అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోంది.



గండికోటలో పెన్నా ప్రవాహం

బలమైన పునాది

వైఎస్ఆర్ జిల్లాలో ప్రభుత్వ చర్యలతో బోటింగ్ సౌకర్యాలు పలుచోట్ల అందుబాటులోకి వచ్చాయి. ఇడుపులపాయ, వేంపల్లి, పులివెందుల, రాయచోటి ప్రాంతాల్లో ఎకో టూరిజం అభివృద్ధికి అవకాశాలున్నట్లు ఆ రంగ ప్రముఖులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం గండికోట, పాలకొండలు, గండిక్షేత్రం, రాయచోటి ప్రాంతాలలో ట్రెక్కింగ్‌కు పుష్కలంగా అవకాశాలున్నట్లు ఆ రంగ ప్రముఖులు గుర్తించారు. అటవీ ప్రాంతాల్లో సాహస క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. లంకమల అడవుల్లో ఇటీవల పెద్ద గుహలను గుర్తించడంతో వాటిని బెలుం గుహల స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి.

కొత్త శక్తులు

కడప నగరం నుంచి ఒంటిమిట్ట మీదుగా చెన్నై రోడ్డులో వరుసగా చిట్వేలి వరకు ప్రసిద్ధమైన దేవాలయాలున్నాయి. ఆ ప్రాంతాన్ని పర్యాటక సర్క్యూట్ గా అభివృద్ధి చేసే అవకాశముందని నిపుణులు సూచిస్తున్నారు. జిల్లా యంత్రాంగం ఇటీవల కడప నగరంలోని పాత కలెక్టరేట్‌ను పునరుద్ధరిస్తోంది. ఇది పూర్తయితే ఆ భవనం టూరిజం ఆకర్షణగా నిలవగలదు. అత్యంత ప్రతిష్టాత్మకమైన సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం పర్యాటక సదస్సులు నిర్వహిస్తూ ఈ రంగం అభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తోంది. బద్వేల్ ప్రాంతంలో యువకుల బృందాలు టూరిజం కార్యకలాపాలు సాగిస్తున్నాయి. కొన్ని ప్రభుత్వ కళాశాలల్లో టూరిజంలో డిగ్రీ కోర్సులు నిర్వహిస్తున్నారు.

క్లుప్తంగా

మార్చురీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జిల్లా ఆస్పత్రిలోని మార్చురీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని భద్రపరిచినట్లు మార్చురీ ఇన్‌చార్జి తేజా తెలిపారు. సుమారు 60 ఏళ్ల కలిగిన వ్యక్తి తీవ్ర అనారోగ్యంతో ఈ నెల 25న ఆస్పత్రిలోని ఎంఎం 1 వార్డులో చేరగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి సంబంధించిన కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రిలోని ఔట్‌పోస్టులో సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప అర్బన్ : కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈనెల 11న ఆసుపత్రిలో చేరే సమయంలో తన పేరు మహబూబ్‌బాషా, పాత కడప అని నమోదు చేయించాడు. చికిత్స పొందుతూ ఈనెల 22న మృతి చెందాడు. రిమ్స్ మార్చురీలోనే అతని మృతదేహం ఉంది. మృతుడి వివరాలు తెలిసిన వారు చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌లో గానీ, కడప రిమ్స్ అధికారులను నేరుగా సంప్రదించాలని పోలీసులు సూచించారు.

యువకుడి అదృశ్యం



సుధీర్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

చాపాడు : మండల పరిధిలోని వెదురూరు గ్రామానికి చెందిన కొండ్రెడ్డి సుధీర్‌కుమార్‌రెడ్డి అనే యువకుడు గత మూడేళ్లుగా కనిపించ లేదని అతని కుటుంబీకులు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు. 2020 డిసెంబరు నెలలో సుధీర్‌కుమార్‌రెడ్డి ఇంటినుంచి వెళ్లిపోగా అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు తమ బంధువులు, సన్నిహితుల గ్రామాలతో పాటు వివిధ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు 9121100601 నంబరుకు తెలియజేయాలని ఎస్‌ఐ కోరారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడి అరెస్టు

చింతకొమ్మదిన్నె : మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడిని అరెస్టు చేసినట్లు సీకే దిన్నె ఎస్‌ఐ బి.అరుణ్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మండలంలోని బుగ్గలేటిపల్లె గ్రామానికి చెందిన తోట సురేంద్ర అనే యువకుడు ఈనెల 21న అదే గ్రామానికి చెందిన బత్తల కళావతి అనే మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం చింతకొమ్మదిన్నె పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కడప స్పెషల్ జేఎఫ్‌సీఎం ప్రొహిబిషన్, ఎక్సైజ్ కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

30 మద్యం బాటిళ్లు స్వాధీనం

పోరుమామిళ్ల : టేకూరుపేటకు చెందిన వి. ఆదినారాయణ నుంచి 30 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం సీతారాంపురం క్రాస్ రోడ్ వద్ద మద్యం బాటిళ్లతో ఉండగా అరెస్టు చేశామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు

- వివాహేతర సంబంధమే కారణం
- కడప చిన్నచౌక్ సీఐ పి.నరసింహారెడ్డి వెల్లడి



నిందితుడు ఆవుల రామాంజనేయులు



మహిళ హత్య కేసు నిందితుని అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న చిన్నచౌక్ సీఐ నరసింహారెడ్డి

కడప అర్బన్ : కడప నగరంలోని ఎన్జీఓ కాలనీలో తాటిచెర్ల లక్ష్మి (48) అనే మహిళను ఈనెల 22వ తేదీన రాత్రి రోకలి బండతో దారుణంగా హత్య చేసిన కేసులో నిందితుడు ఆవుల రామాంజనేయులును పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు చిన్నచౌక్ సీఐ పి. నరసింహారెడ్డి మంగళవారం తమ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కడప నగరంలోని ఎన్జీఓ కాలనీలో తాటిచెర్ల లక్ష్మి (48) ఓ ఇంటిలో అద్దెకు ఉంటూ కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈమె భర్త నారాయణ స్వామి గతంలోనే చనిపోయాడు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు. వారికి తాము గతంలో నివాసం ఉండిన ముద్దనూరులోనే వివాహాలు చేసి, తన బతుకు దెరువు కోసం రెండేళ్ల క్రితం కడపకు వచ్చింది. జమ్మలమడుగు టౌన్ కన్నెలూరులో నివాసం ఉంటున్న అనంతపురం జిల్లా పుట్లూరు మండలం, సంజీవపురానికి చెందిన ఆవుల రామాంజనేయులుతో తాటిచెర్ల లక్ష్మికి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. అయితే అప్పటికే ఆవుల రామాంజనేయులుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. తమ మధ్య ఉన్న వివాహేతర సంబంధం విషయం రామాంజనేయులు భార్యకు తెలియడంతో ఎక్కడ తన భార్య, పిల్లలు దూరమవుతారోనని అతను కొంతకాలం తాటిచెర్ల లక్ష్మి ఇంటికి వెళ్లలేదు. దీంతో లక్ష్మి ఆవుల రామాంజనేయులుకు ఫోన్ చేసి, నీ భార్య పిల్లలను వదిలేసి తన దగ్గరకు రాకపోతే మీ ఇంటి వద్దకు వచ్చి గొడవ చేస్తానని, పోలీసు కేసు పెడతానని బెదిరించింది. దీంతో ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో ఆమెను అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 22న కడపకు వచ్చి తాటిచెర్ల లక్ష్మి ఇంటికి వెళ్లాడు. అదే రోజు రాత్రి సమయంలో ఇద్దరు భోజనం చేసి, పడుకున్న తరువాత అర్ధరాత్రి సమయంలో పథకం ప్రకారం లక్ష్మిని రోకలిబండతో తలపై, ముఖంపై బలంగా కొట్టి దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటన జరిగిన తరువాత రోజున పోలీసులకు సమాచారం వచ్చింది. హత్య సంఘటనను ఛేదించేందుకు కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్ పర్యవేక్షణలో చిన్నచౌక్ సీఐ పి. నరసింహారెడ్డి, ఎస్‌ఐలు పి. రవికుమార్, పి. తులసీనాగప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ జె. రామసుబ్బారెడ్డి, కానిస్టేబుళ్లు పి.వి. శ్రీనివాసులు, ఏ. శివప్రసాద్, రంతుబాషాలతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులు దర్యాప్తులో భాగంగా సమగ్రంగా దర్యాప్తు చేపట్టి ఈనెల 25వ తేదీ సోమవారం రాత్రి నిందితుడిని అరెస్ట్ చేశారు. అతను హత్యకు ఉపయోగించిన రోకలిబండను స్వాధీనం చేసుకున్నారు.

బాల్యవివాహాలకు పాల్పడితే కఠిన చర్యలు

దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ



మాట్లాడుతున్న దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ

కడప కల్చరల్ : బాల్య వివాహాలకు పాల్పడే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ హెచ్చరించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో జిల్లాకు చెందిన అన్ని ప్రభుత్వ, ప్రైవేటు దేవాలయాల అర్చకులు, ఈఓలు, ఆలయ కమిటీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు జిల్లా యంత్రాంగం బాల్యవివాహాల నిషేధానికి గట్టి చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం బాలికలకు 18, బాలురకు 21 సంవత్సరాలు నిండి ఉంటేనే వారికి వివాహం చేయవచ్చన్నారు. ఆ లోపు వయస్సు వారికి వివాహం చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఆలయ అధికారులు ఆ జంటల వయసును గురించి కచ్చితమైన ఆధారాలు ఉన్నట్లు ధ్రువీకరించుకున్న తర్వాతే వారిని వివాహాలు చేసుకునేందుకు అనుమతించాలని సూచించారు. ఆలయాల అర్చకులు, ఈఓలు ఈ విషయంగా ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎక్కడైనా ఇలాంటి వివాహాలకు పాల్పడితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్లు 100, 1098 కి ఫోన్ చేసి తెలపాలని సూచించారు. అర్చక సమాఖ్య అధ్యక్షుడు విజయ భట్టర్ మాట్లాడుతూ హిందువుల వివాహాలు ఎక్కువగా దేవాలయాలలోనే జరుగుతాయని, అందుకే అర్చకులు, ఈఓలు ఈ విషయంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు పలువురం హరి ప్రవీణ్, ప్రశాంత్, ఇంద్రగంటి ప్రశాంత్ శర్మ, కొప్పర్తి ప్రసాద్‌శర్మ, సుదర్శనాచార్యులు, కిరణ్, సుధీర్, మహేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

పశు పోషణతో ఆర్థిక స్వావలంబన

జేసీ గణేష్‌కుమార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేసీ గణేష్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్ : గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషణ ద్వారా రైతులకు ఆర్థిక స్వావలంబన చేకూరుతుందని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సభా భవనంలో పశుసంవర్ధకశాఖ జేడీ శారదమ్మ అధ్యక్షతన నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం ఆవశ్యకతపై పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకం దారులకు నిర్వహించిన జిల్లా స్థాయి అవగాహన సదస్సులో జేసీ మాట్లాడారు. ప్రపంచం పాడి, పశుసంపదపై ఆధారపడి జీవిస్తోందన్నారు. పశుపక్ష్యాదులు, పెంపుడు జంతువుల సంరక్షణతోనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖలను మరింత పటిష్టం చేసే దిశగా భారత ప్రభుత్వం నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థికంగా ఎదగాలన్నారు. రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ లైవ్ స్టాక్ మిషన్ నిధులతో 2021–22 నుంచి 2025–26 సంవత్సరాల కాల పరిమితిలో ఔత్సాహిక రైతులను వ్యాపార సరళిలో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఔత్సాహిక రైతులు, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధకశాఖ జేడీ శారదమ్మ కోరారు. ఈ సమావేశంలో జిల్లా గొర్రెల సహకార సంఘం అధ్యక్షుడు నాగ మల్లేశ్వరయ్య, ప్రొద్దుటూరు వెటర్నరీ కళాశాల డీన్ వై.వెంకటరావు, లీడ్‌బ్యాంకు మేనేజర్ సునీత, ఏపీజీబీ రీజినల్ మేనేజర్ పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

వన్డే టోర్నీలో బౌలర్ల హవా

సౌత్‌జోన్, నార్త్‌జోన్, నెల్లూరు జట్ల విజయం



వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ మైదానంలో తలపడుతున్న కృష్ణా, నార్త్‌జోన్ జట్లు



5 వికెట్లు తీసిన నెల్లూరు బౌలర్ మాధవ్, విజయనగరం బౌలర్ దుర్గాకుమార్ నార్త్‌జోన్ బౌలర్ సాయిశ్రావణ్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–23 అంతర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో బౌలర్ల హవా కొనసాగుతోంది. మంగళవారం వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో కృష్ణా జట్టు, నార్త్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నార్త్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 49 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 245 పరుగులు చేసింది. జట్టులోని సాయిశ్రావణ్ 71 పరుగులు, హర్షవర్ధన్ 68 పరుగులు, రాహుల్ 55 పరుగులు చేశారు. కృష్ణా బౌలర్లు సుశాంత్‌నాయుడు 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 49 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 216 పరుగులు మాత్రమే చేయగలిగింది. జట్టులోని బ్రహ్మతేజ 54 పరుగులు చేశాడు. నార్త్‌జోన్ బౌలర్లు సాయిశ్రావణ్ 5 వికెట్లు, శ్రీకర్‌సాయిరెడ్డి 2 వికెట్లు తీశారు. దీంతో నార్త్‌జోన్ జట్టు 29 పరుగుల తేడాతో విజయం సాధించింది.

సౌత్‌జోన్ జట్టు విజయం..

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో సౌత్‌జోన్, సెంట్రల్‌జోన్ జట్లు తలపడ్డాయి. వర్షం కారణంగా ఓవర్లను కుదించారు. టాస్ గెలిచిన సౌత్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 25 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. జట్టులోని ధరణి కుమార్‌నాయుడు 73 పరుగులు, ఇస్మాయిల్ 47 పరుగులు చేశారు. సెంట్రల్‌జోన్ బౌలర్ వెంకటసుమిత్ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్‌జోన్ జట్టు 23.3 ఓవర్లలో 120 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని సిద్దార్థ 46 పరుగులు చేశాడు. సౌత్‌జోన్ బౌలర్లు సంతోష్ 4, ఇస్మాయిల్ 3 వికెట్లు తీశారు. దీంతో సౌత్‌జోన్ జట్టు 45 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

నెల్లూరు జట్టు విజయం..

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విజయనగరం, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన విజయనగరం జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 40.4 ఓవర్లలో 204 పరుగులు చేసింది. జట్టులోని నిఖిలేశ్వర్‌రెడ్డి 37 పరుగులు చేశాడు. విజయనగరం బౌలర్ దుర్గాకుమార్ 5 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విజయనగరం జట్టు 39.2 ఓవర్లలో 175 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని హరీష్ 45 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్లు మాధవ్ 5 వికెట్లు, అఖిల్ 2 వికెట్లు తీశారు. దీంతో నెల్లూరు జట్టు 29 పరుగుల తేడాతో విజయం సాధించింది.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో జిల్లాకు పతకాల పంట



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న డీఈఓ వై. రాఘవరెడ్డి

కడప స్పోర్ట్స్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా నున్నలో నిర్వహించిన 67వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ పోటీల్లో వైఎస్సార్ జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో వివిధ కేటగిరీల్లో అండర్–14, అండర్–17 బాలబాలికల విభాగాల్లో మొత్తం 14 పతకాలు సాధించారు. వీరిలో అండర్–14 బాలికల విభాగంలో కె. వెంకటలక్ష్మి, అండర్–17 బాలుర విభాగంలో 65 కేజీల విభాగంలో పి. వెంకట రిషికిరణ్, 71 కేజీల విభాగంలో జి. వినయ్‌లు స్వర్ణపతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా విద్యాశాఖాధికారి వై. రాఘవరెడ్డి మంగళవారం డీఈఓ కార్యాలయంలో అభినందించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి, వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్. వెంకటలక్ష్మి, విజయలక్ష్మి, సాజిత్, నిత్య ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు

భారతి డీఏవీ విద్యార్థులు



ప్రణవి, పూజలను అభినందిస్తున్న గోపాల్‌రెడ్డి, కిషోర్‌కుమార్

కమలాపురం : మండల పరిధిలోని నల్లింగాయపల్లిలో వెలసిన భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) లోని డీఏవీ విద్యార్థులు రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ కిషోర్ కుమార్ తెలిపారు. సోమవారం వేంపల్లెలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్ ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు అండర్–17 బాలికల విభాగంలో భారతి డీఏవీకి చెందిన వి.ప్రణవి రెడ్డి (9వ తరగతి), అండర్–14 బాలికల విభాగంలో కె.పూజ (7వ తరగతి) హాజరై అత్యున్నత ప్రతిభ ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కాగా మంగళవారం వారిని డీఏవీ పాఠశాలలో హెచ్‌ఆర్ చీఫ్ మేనేజర్ గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ కిషోర్ కుమార్‌లు అభినందించారు. అలాగే రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం మంచి ప్రతిభ కనబరిచి రాణించాలని విజేతలకు సూచించారు. పీఈటీ చందును వారు అభినందించారు.

లంకమల్ల అభయారణ్యంలో కూంబింగ్



లంకమల్ల అభయారణ్యంలో కూంబింగ్ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు

సిద్దవటం : లంకమల్ల అభయారణ్యంలో రెండురోజుల పాటు కూంబింగ్ కార్యక్రమాన్ని నిర్వహించామని సిద్దవటం రేంజర్ కళావతి, ప్రొద్దుటూరు రేంజర్ హేమాంజలి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ కడప డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి ఆదేశాల మేరకు తమ సిబ్బందితో కలిసి లంకమల్ల అభయారణ్యంలో రెండు బృందాలుగా విడిపోయి సోమ, మంగళవారాల్లో రెండు రోజులు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించామన్నారు. అందులో భాగంగా సమస్యాత్మక ప్రదేశాలైన ట్రై జంక్షన్, సాకిరేవులు, పసిరేవులు, ముట్టిక్కుడు, సవర్లబావి, నరుకుడు బండ, పాతాల బండ, రాయలచెరువు వంటి అటవీ ప్రదేశాల్లో స్మగ్లర్ల ఆచూకీ కోసం జల్లెడ పట్టినట్లు తెలిపారు. ఎక్కడ కూడా ఏ విధమైన స్మగ్లింగ్ ఆనవాళ్లు కనిపించలేదన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ ఓబులేసు, ఎఫ్‌బీఓలు పెంచల్‌రెడ్డి, జాకీర్, రమణ నాయక్, శాంతి, ఏబీఓ సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ఐదుగురు స్మగ్లర్ల అరెస్టు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎఫ్ఆర్ఓ రమణారెడ్డి

బద్వేలు అర్బన్ : లంకమల అభయారణ్యంలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఐదుగురు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు బద్వేలు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పి.వి.రమణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక సిద్దవటం రోడ్డులోని ఫారెస్టు బంగ్లా ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. లంకమల అభయారణ్యంలో ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచారని అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారన్నారు. అభయారణ్యంలోని లోతువంక బీటులో గల లక్ష్మీబావికుంట ప్రాంతంలో ఐదుగురు వ్యక్తులు దుంగలు తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. పట్టుబడిన వారిలో బి.మఠం మండలం జెడ్.కొత్తపల్లె గ్రామానికి చెందిన బాలస్వామి, రాజన్న, సుందర్‌రావు, బాలరాజు, శేఖర్ ఉన్నారన్నారు. వీరు నెల్లూరు జిల్లా వింజమూరు మండలానికి చెందిన గుద్దేటి రామనాథరెడ్డి అలియాస్ వింజమూరు రామనాథరెడ్డి, బి.మఠం మండలం జెడ్.కొత్తపల్లె గ్రామానికి చెందిన అనకర్ల బాబుల ప్రోత్సాహంతో దుంగల అక్రమ రవాణాకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు ప్రోత్సహించిన, పాల్పడిన ఏడుగురిపై కేసు నమోదు చేసి తిరుపతి ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు ఆయన తెలిపారు. స్వాధీనం చేసుకున్న 274 కిలోల దుంగల విలువ సుమారు రూ.76 వేలు ఉంటుందన్నారు. సమావేశంలో ట్రైనీ ఐఎఫ్ఎస్ శుభమ్, డీఆర్ఓ వెంకటశేషయ్య, ఎఫ్‌బీఓలు శ్యాంసుందర్, సుదర్శనం, సువర్ణకుమార్, రాజేష్‌రెడ్డి, ఏబీఓలు సుంకయ్య, షాజహాన్, ప్రొటెక్షన్ వాచర్లు వినోద్, రాజశేఖర్‌రెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ కేసులో నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ

పులివెందుల రూరల్ : చుక్కల భూములకు ఎన్‌ఓసీ పేరుతో ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ రాజు తెలిపారు. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన కంప్యూటర్, మానిటర్, సీపీయూ ప్రింటర్ ఇతర కంప్యూటర్ వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. మంగళవారం రాత్రి పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. నిందితులు శ్రీపతి శ్రీనివాసులు, వీఆర్ఓ గూడూరు కళానందరెడ్డి, సర్వేయర్లు అంజిరెడ్డి సందీప్‌రెడ్డి, చీపాటి వాసుదేవరెడ్డి ఫోర్జరీకి పాల్పడ్డారన్నారు. విద్యానందరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. తక్కువ సమయంలో సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో పులివెందుల టౌన్‌లోని చుక్కల భూములు, డీకేటీ భూములు ఎంచుకుని ఆ భూములకు కలెక్టర్ ద్వారా ఎన్‌ఓసీ పత్రాలు తెప్పిస్తామని సంబంధిత భూ యజమానులను నమ్మించారు. ఈ విధంగా పలువురి నుంచి లక్షల్లో డబ్బులు వసూలు చేశారు. నిందితులకు ఉన్న కంప్యూటర్ పరిజ్ఞానంతో నకిలీ ఎన్‌ఓసీ పత్రాలు సృష్టించారు. అలాగే అధికారి సంతకం ఫోర్జరీ చేసి నిజమైన ఎన్‌ఓసీ పత్రంగా నమ్మించారు. దీంతో పులివెందుల టౌన్‌లోని చుట్టు పక్కల భూములసర్వే నంబర్లు 99–3, 99–1,–2ఎ2–2ఏ, 0–2, 135–3, 45–2,135, –258–2,98–1ఏ, మొత్తం 30 ఎకరాలలో రిజిస్టర్ చేయించి డబ్బులు వసూలు చేశారు. అవి ఫోర్జరీ పత్రాలని తేలడంతో నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు వారిని పట్టణంలోని కోర్టు సర్కిల్ వద్ద ఎస్‌ఐ సత్యనారాయణ అరెస్టు చేశారు. అనంతరం వారిని కోర్టులో హాజరు పరిచారు. సమావేశంలో ఏఎస్‌ఐ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేషనల్ హాకీ క్యాంపునకు క్రీడాపాఠశాల విద్యార్థులు



తులసిని అభినందిస్తున్న ప్రత్యేకాధికారి, కోచ్



గోల్‌కీపర్‌గా ఎంపికైన శైలజ

కడప స్పోర్ట్స్ : ఈనెల 21 నుంచి అక్టోబర్ 20వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రం రూర్కెలాలోని బిర్సా ముండా హాకీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఆలిండియా సబ్‌జూనియర్ హాకీ మహిళా కోచింగ్ క్యాంపునకు కడప వైఎస్ఆర్ క్రీడాపాఠశాలకు చెందిన క్రీడాకారిణులు ఎంపికయ్యారు. పాఠశాలలో పదోతరగతి చదువుతున్న కుప్పా తులసి, పూర్వ విద్యార్థి టి. శైలజలు అండర్–16 విభాగంలో కోచింగ్ క్యాంపునకు ఎంపికయ్యారు. ఈ క్యాంపులో ఉత్తమ ప్రతిభ కనబరిస్తే భారత సబ్‌జూనియర్ మహిళా హాకీ జట్టుకు ఎంపికయ్యే అవకాశం ఉందని క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి జగన్నాథరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో హాకీ కోచ్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

చింతకొమ్మదిన్నె : మండలంలోని రాజుల తాతయ్యగారిపల్లికి చెందిన బత్తల నాగేంద్ర (50) అనే వ్యక్తి మంగళవారం ఊరి బయట ఉన్న వేప చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందినట్లు సీకేదిన్నె ఎస్‌ఐ భూమా అరుణ్‌రెడ్డి తెలిపారు. మృతుడు తాగుడుకు బానిసై ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసిందన్నారు. ఇతనికి భార్యతో పాటు, కుమారుడు, కుమార్తె ఉన్నారన్నారు. మృతుడి కుమారుడు లక్ష్మినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అవయవదానంపై అవగాహన అవసరం



అవయవదానం ప్రతిజ్ఞ చేయిస్తున్న రిమ్స్ అధికారులు

కడప అర్బన్ : ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన పెంచుకోవాలని కడప రిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు అవయవదానంపై అవగాహన పెంచేందుకు కడప రిమ్స్ ఐపీ విభాగంలో లెక్చర్ హాలులో రిమ్స్ వైద్య విద్యార్థులు, నర్సింగ్, వైద్యులు, స్టాఫ్ నర్సులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. సురేఖ, సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ రాజేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా దాదాపు 500 మంది అవయవదానం రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సిద్ధపడ్డారు. స్వచ్ఛందంగా అవయవదానం రిజిస్ట్రేషన్ ప్రతిజ్ఞను అధికారులు చేయించారు.

భార్య, మామపై అలుడి హత్యాయత్నం

- ఇద్దరి పరిస్థితి విషమం
- డబ్బు విషయంపై గొడవ
- కేసు నమోదు చేసిన పోలీసులు

ములకలచెరువు : ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యపై భర్త కత్తితో దాడి చేస్తుండగా అడ్డొచ్చిన మామపై కూడా అల్లుడు విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మంగళవారం ములకలచెరువు మండలంలో చోటుచేసుకుంది. సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐ గాయత్రి కథనం మేరకు వివరాలు.. మండలంలోని దేవులచెరువు పంచాయతీ రాజుగారిపల్లెకు చెందిన చంద్రశేఖర్, వసంతమ్మ కుమార్తె అపూర్వ(25)కు అదే గ్రామానికి చెందిన దేవరాజుతో ఏడేళ్ల క్రితం ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. వీరంతా అపూర్వ తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నారు. కొన్ని రోజుల క్రితం టమాట డబ్బులు రూ. 2 లక్షలు అల్లుడు వాడుకున్నాడని మామ చంద్రశేఖర్ అడగడంతో అప్పుల వాళ్లకు కట్టినట్లు చెప్పాడు. డబ్బుల విషయమై ఇంట్లో గొడవ జరిగింది. దీంతో అత్తామామల ఇంట్లో ఉండకుండా భార్య, పిల్లలతో దేవరాజు వేరుగా కాపురం పెట్టాడు. డబ్బుల విషయంపై తరచూ దేవరాజుకు, అతని భార్య అపూర్వకు మధ్య గొడవ జరిగేది. దీంతో రెండు రోజుల క్రితం ఆమె అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. డబ్బు విషయమై తనను అవమానించారని భార్య, మామపై కక్ష పెంచుకున్న దేవరాజు తన భార్య అపూర్వ పొలం వద్ద పనులు చేసుకుంటుండగా ఆమెపై కత్తితో దాడికి దిగాడు. గమనించిన మామ చంద్రశేఖర్ అడ్డురావడంతో మామపై కూడా దాడిచేసి పారిపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం తంబళ్లపల్లె పీహెచ్‌సీకి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచనతో తిరుపతికి తరలించారు. సీఐ శివాంజనేయులు రాజుగారిపల్లెకు వెళ్లి జరిగిన సంఘటనపై విచారించారు. అపూర్వ తల్లి వసంతమ్మ ఫిర్యాదుతో దేవరాజుపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.